

బేబక్క మృతి తీరని లోటు

బేబక్క అకాల మృతి భారత విప్లవ ఉద్యమాలకు తీరని లోటు అని పలువురు నాయకులు అన్నారు. శనివారం బేబక్క అంతిమ యాత్ర నిర్వహించారు. - 8లో▸



సాంకేతిక పరిజ్ఞానం అందించాలి

వ్యవసాయ శాస్త్రవేత్తలు నూతన సాంకేతిక పరిజ్ఞానాన్ని రైతులకు సకాలంలో అందించాలని జీపీటీఎస్ఏయూ విస్తరణ సంచాలకులు డాక్టర్ సుధారాణి అన్నారు. - 8లో▸

గరిష్టం/కనిష్టం
$33^0/24^0$

వాతావరణం

జిల్లాలో ఉదయం చల్లని వాతావరణం ఉండడంతో పాటు ఆకాశం మేఘావృతమై ఉంటుంది. రాత్రి సమయంలో చలి సాధారణంగా ఉంటుంది.



న్యూస్‌రీల్

క్రీడాకారులు సద్వినియోగం చేసుకోవాలి



భూపాలపల్లి అర్బన్: రూ.5.50 లక్షలతో ఏరియాలోని కృష్ణకాలనీ సింగరేణి కమ్యూనిటీ హాల్లో ఏర్పాటుచేసిన సింథటిక్ షటిల్ కోర్టును సింగరేణి క్రీడాకారులు సద్వినియోగం చేసుకోవాలని ఏరియా సింగరేణి జనరల్ మేనేజర్ శ్రీనివాసరావు అన్నారు. శనివారం కోర్టును ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో అధికారులు ఎస్‌వీ.రావు, రామలింగం, వెంకటరావి ఎరెడ్డి, సత్యనారాయణ, తుకారాం, నాయకులు సమ్మయ్య, రమేష్ పాల్గొన్నారు.

పాఠశాలపై చర్య తీసుకోవాలి



భూపాలపల్లి అర్బన్: జిల్లాకేంద్రంలో ప్రభుత్వ నిబంధనలు పాటించని శ్రీ చైతన్య హైస్కూల్‌పై విద్యాశాఖ అధికారులు తక్షణమే చర్యలు తీసుకోవాలని ఎస్ఎఫ్‌యూఐ నాయకులు శనివారం పాఠశాల ఎదుట ధర్నా చేపట్టారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి ఎస్ఎస్‌యూఐ జిల్లా అధ్యక్షుడు బట్టు కరుణాకర్ మాట్లాడారు. విద్యార్థులకు కనీస మౌలిక సదుపాయాలు కల్పించడం లేదన్నారు. పాఠశాలలో సమస్యలు పరిష్కరించాలని ఆరునెలల క్రితం ఎంఈఓకు వినతిపత్రం ఇచ్చినప్పటికీ చర్యలు తీసుకోకపోవడం బాధాకరమన్నారు. ఇప్పటికైనా స్పందించకుంటే పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడుతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు సురేష్, కార్తీక్, తిలక్, రిజ్వాన్, నీరజ్, మహేందర్, వేణు, అనురాగ్, అజయ్ పాల్గొన్నారు.

ఉత్తమ గ్రామ పంచాయతీలుగా ఎంపిక



అవార్డు అందుకుంటున్న జూకల్ సర్పంచ్



అవార్డు అందుకుంటున్న నవాబుపేట సర్పంచ్

చిట్యాల: జిల్లాస్థాయి ఉత్తమ పంచాయతీలుగా చిట్యాల మండలం జూకల్, నవాబుపేట, నైన్‌ పాక గ్రామాలుగా ఎంపికయ్యాయి. జిల్లా కార్యాలయంలో జరిగిన అవార్డు ప్రదానోత్సవాలలో సర్పంచ్‌లు పుట్టపాక మహేందర్, కసిరెడ్డి సాయి సుధా, తోట్ల లక్ష్మి, పంచాయతీ కార్యదర్శులు భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర వెంకట రమణారెడ్డి, కలెక్టర్ భవేష్ మిశ్రా, అదనపు కలెక్టర్ దివాకర, డీపీఓ ఆశాలత చేతుల మీదుగా అవార్డులు అందుకున్నారు. ఈ సందర్భంగా అధికారులకు, గ్రామ పాలక మండలి సభ్యులకు సర్పంచ్‌లు కృతజ్ఞతలు తెలిపారు.

ఎస్సీ వర్గీకరణ బిల్లు ఆమోదించాలి

ములుగు రూరల్(గోవిందరావుపేట): ఎస్సీ వర్గీకరణ బిల్లును పార్లమెంట్‌లో ఆమోదించాలని ఎంఎస్‌పీ ఉమ్మడి జిల్లా ఇన్‌చార్జ్ మంద కుమార్ డిమాండ్ చేశారు. గోవిందరావుపేట మండలం పస్రాలో శనివారం నిర్వహించిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వంద రోజుల్లో వర్గీకరణ చేపడతామని హామీనిచ్చి అమలు చేయలేదన్నారు. ఎస్సీ వర్గీకరణ కోసం ఎమ్మార్పీఎస్ అధ్యక్షుడు మంద కృష్ణ మాదిగ 29 సంవత్సరాలుగా పోరాటం చేస్తున్నారని తెలిపారు. ఎన్నికల సమయంలో బీజేపీ హామీ ఇచ్చి మాదిగలను మోసం చేసిందన్నారు. ఈ నెల 31వ తేదీన చేపట్టిన కలెక్టరేట్ కార్యాలయాల ముట్టడిని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో నాయకులు నెమలి నర్సయ్య, ఇరుగు పైడి మాదిగ, శ్యాంబాబు పాల్గొన్నారు.

మన బలగం

తెరవెనుక, తెరపైన ఓరుగల్లు కళాకారులు

- ప్రతీ పాత్రలోనూ జీవించిన నటులు
- పాటల రచయిత, సంగీతం, సినిమాటోగ్రఫీ మన వాళ్లే
- కంటతడి పెట్టించిన మొగిలయ్య–కొంరమ్మల పాట

చిన్న చిన్న సమస్యలతో తోబుట్టువులను, మన కోసం పరితపించే పుట్టిడు బలగాన్ని కొందరు దూరం చేసుకుంటున్నారు. తిరిగి అందరూ కలిస్తే కలిగే బలమే 'బలగం'. గ్రామీణ జీవితం ఇతివృత్తంతో ఒక కుటుంబ పెద్ద చనిపోతే ఆ ఇంట్లో జరిగే గొడవలు.. అనుబంధాలతో తెరకెక్కిన ఈ చిత్రం అందరినీ థియేటర్‌కు రప్పించి.. కన్నీరు పెట్టించింది. ఇంత గొప్ప సందేశాన్ని ప్రపంచానికి అందించిన సినిమాలో మన బలగం (ఓరుగల్లు కళాకారులు) కీలకపాత్ర పోషించింది. వారిపై 'సాక్షి' సండే స్పెషల్ స్టోరీ.



- సాక్షి, మహబూబాబాద్/దుగ్గొండి

పాటల ఊట 'శ్యామ్'




హనుమకొండ బ్రాహ్మణవాడలోని కాసర్ల మధుసూదన్, మాధవి దంపతుల కుమారుడు శ్యామ్. చిన్నతనంలోనే జానపద కళాకారులు సారంగపాణి, శంకర్‌ను అనుసరిస్తూ అనేక జానపదాలు రాశారు. అంతటితో ఆగకుండా సినీ రంగంలో ప్రవేశించి ఇప్పటి వరకు 300లకు పైగా పాటలు రాశారు. ప్రతి పాట వన్స్‌మోర్ అనేలా ఉండడం ఆయన ప్రతిభకు నిదర్శనం. ఇందులో 'రాములో.. రాములా.. డీజే టిల్లూ పేరు.. నీలపురి గాజుల ఓ నీలవేణీ.. నిన్ను చూడ బుద్ధి అవుతుంది రాజిగో.. ఇలా అనేక పాటలు రాశారు. బలగం సినిమాలో అన్ని పాటలు రాయడమే కాదు.. సినిమాలో పాత్రల ఎంపిక, షూటింగ్, సన్నివేశాలు.. ఇలా అన్ని విషయాల్లో దర్శకులు వేణుకు సహకారం అందించారు.

మైమరిపించిన 'మధు'



హనుమకొండ పట్టణంలోని భీమారం ప్రాంతానికి చెందిన రిటైర్డ్ రెవెన్యూ ఉద్యోగి ఓదెలు, వినోదల కుమారుడు మధుసూదన్(మధు). చిన్నప్పటి నుంచే మైమ్ కళాకారుడిగా వేలాది స్టేజీ షోలు ఇచ్చారు. ప్రపంచ మైమ్ ప్రదర్శనల్లో ఉత్తమ కళాకారుడిగా ఎంపికయ్యారు. ప్రపంచ మైమ్ థియేటర్‌కు ఎంపికైన రెండో ఆసియావాసిగా పేరు తెచ్చుకున్నారు. ఉస్తాద్ బిస్మిల్లా ఖాన్ సంగీత, నాటక, రంగస్థల అవార్డు గ్రహీతగా, నాటకరంగంలో అతి చిన్న వయస్సులోనే ఉత్తమ నంది అవార్డు అందుకున్నారు. ఇలా చెప్పుకుంటూ పోతే.. సినిమా, నాటక, టీవీ అనేక రంగాల్లో రాణిస్తున్న కళాకారుడు మైమ్ మధు. బలగం సినిమాలో కొమురయ్య చిన్నకొడుకు మొగిలయ్య పాత్రలో నటించారు. బతుకుదెరువు కోసం సూరత్ వెళ్లిన అతను తండ్రి చనిపోగానే ఇంటికి రావడం, అన్నాదమ్ముల మధ్య పంచాయితీ, అనుబంధం, డబ్బులు లేమితనం దృశ్యాల్లో కళ్లకు కట్టినట్లు నటించారు.

బలగానికి మరింత బలం 'వేణు'



బలగం సినిమా చూస్తున్నంతసేపు మట్టి మనుషుల వాసనొస్తుంది. మానవ సంబంధాల పరిమళం గుభాళిస్తుంది. మొత్తంగా చెప్పాలంటే సినిమాలో లీనమైపోతాం. అలా చేయడంలో దర్శకుడి పాత్ర ఎంతుందో.. సినిమాటోగ్రాఫర్ పాత్ర కూడా అంతే ఉంది. షాట్‌ను ఎలా చిత్రీకరించాలి? ఏ లొకేషన్‌లో ఏ కెమెరా వాడాలి. లైట్స్ వినియోగం.. లొకేషన్ సెట్టింగ్ ఇలా బలగం సినిమాకు సినిమాటోగ్రాఫర్ ఆచార్య వేణు మరింత బలం చేకూర్చారు. వేణుది భూపాలపల్లి జిల్లా రంగయ్యపల్లి. కోల్‌కతాలోని ప్రఖ్యాత సినీరంగ బోధన సంస్థ 'సత్యజిత్ రే ఫిల్మ్ అండ్ టెలివిజన్ ఇన్‌స్టిట్యూట్'లో మోషన్ ఫొటోగ్రఫీలో పీజీ డిప్లమా పూర్తి చేశారు. మొదటి చిత్రం గారో భాషలో 'మా.. అమా' సినిమా ద్వారా అంతర్జాతీయ చిత్రోత్సవంలో 'ఏషియన్ న్యూ టాలెంట్' పురస్కారాన్ని అందుకున్నారు. ఆతర్వాత జెర్సీ సినిమాకు పనిచేశారు. టాలీవుడ్‌లో బలగం సినిమాకు పూర్తి స్థాయిలో సినిమాటోగ్రాఫర్‌గా చేశారు. సినిమా విజయంలో భాగమయ్యారు.

జానపదం.. సినిమాకు ప్రాణపదం!



'తోడుగా మాతోడుండి.. నీడగా మాతో నడిచి.. నువ్వెక్కడికెళ్లినావు కొంరయ్యా..' అంటూ తంబుర, దిమ్మిసతో పాడిన పాట ప్రేక్షకులను భావోద్వేగానికి గురి చేసి కంటనీరు పెట్టించింది. ఈ పాట పాడింది.. ఎవరో కాదు.. మన వరంగల్ జిల్లా దుగ్గొండి మండల కేంద్రానికి చెందిన బుడిగ జంగాలు పస్తం మొగిలయ్య– కొంరమ్మ దంపతులు. బలగం సినిమా డైరెక్టర్ వేణు తన సినిమాలో జానపద కళలు, కళారూపాలకు ప్రాతినిధ్యం కల్పించాలని సింధు కళాకారులు, మందహెచ్చలు, బుడిగ జంగాల కళాకారులతో పాడించారు. ఇదే తరుణంలో.. దుగ్గొండికి వచ్చి పస్తం మొగిలయ్య–కొంరమ్మతో అనేక రకాల దరువులతో పాటలు పాడించుకున్నారు. దరువులు నచ్చాయని చెప్పి వెళ్లి 30 రోజులకు అందిన పిలుపుతో దంపతులిద్దరూ హైదరాబాద్ వెళ్లి 14 రోజులు షూటింగ్‌లో పాల్గొన్నారు. బలగం సినిమా చివరలో మొగిలయ్య–కొంరమ్మలు పాడిన పాట హిట్‌గా మారి ప్రేక్షకుల హృదయాల్లో నిలిచింది.

కంట తడిపెట్టించి... పుట్టెడు కష్టాల్లో

తమ పాట ద్వారా కోట్లాది మంది ప్రేక్షకులను కంటతడి పెట్టించిన మొగిలయ్య.. ఇప్పుడు చావు బతుకుల మధ్య ఉన్నాడు. ఏడాది క్రితమే ఆయనకు కిడ్నీ సమస్య వచ్చింది. రెండు కిడ్నీలు పాడయ్యాయి. దీంతో డయాలసిస్ ద్వారా జీవనం సాగిస్తున్నాడు. రెండు కళ్ల చూపు కోల్పోయాయి. సినిమా విజయవంతమవడంతో సంబరాలు జరుపుకోవాల్సిన మొగిలయ్య కుటుంబం ఇప్పుడు పుట్టెడు కష్టాలతో జీవనం సాగిస్తోంది.

పాత్రేదైనా.. 'రచ్చ'



అనతి కాలంలోనే వెండితెర, బుల్లి తెర ప్రేక్షకులకు సుపరిచితుడయ్యారు కళాకారుడు రచ్చ రవి. జబర్దస్త్ కళాకారుడిగా అందరికీ పరిచయమైన దొడిపాటి రవికుమార్‌ది హనుమకొండలోని వెయ్యి స్తంభాల దేవాలయం ప్రాంతం. వెయ్యి అబద్ధాల సినిమా నుంచి శతమానం భవతి, నారప్ప, సర్దార్ గబ్బర్ సింగ్.. వాల్తేరు వీరయ్యవంటి వందకు పైగా సినిమాల్లో నటించారు. అన్ని మాండలికాల్లో.. కమేడియన్ నుంచి విలన్ వరకు పాత్రలకు జీవం పోసి శభాష్ అనిపించుకున్నారు. బలగం సినిమాలో ఆటో రాజేశ్ పాత్రతో ప్రేక్షకులకు మరింత దగ్గరైన ఓరుగల్లు బిడ్డ రవి. వరంగల్ స్వచ్ఛ అంబాసిడర్‌గా ఉంటున్నారు. తెలంగాణ రాష్ట్ర వృక్షం జమ్మి చెట్టును ప్రతీ దేవాలయం, ప్రతీ రాష్ట్రంలో నాటేందుకు సంకల్పించారు. ఇప్పటి వరకు ముంబై, అస్సాం రాష్ట్రాల్లో నాటారు. 'చిన్న చిన్న సమస్యలు, తగాదాలతో బంధాలు తెంచుకోవద్దని చెప్పే ప్రయత్నం బలగం సినిమా అని, మన బలగమే బలం' అంటారు రచ్చ రవి.

పాత్రకు ప్రాణం పోసిన 'ప్రభాకర్'



వరంగల్ పట్టణంలోని గేటు కింద ఏరియాలో నివాసం ఉండే సీనియర్ కళాకారులు వేముల ప్రభాకర్. యాభై ఏళ్లుగా కళామతల్లినే నమ్ముకొని జీవిస్తున్నారు. సమాజంలోని రుగ్మతలను పారదోలేందుకు ఉమ్మడి వరంగల్ జిల్లాలోని గ్రామ గ్రామాన తిరిగి నాటక ప్రదర్శనలు చేశారు. బలగం సినిమాలో గ్రామ పెద్ద పాత్రకు జీవం పోశారు. తెలంగాణలోని గ్రామ పెద్దలు, కట్టుబాట్లను తెలిపే పాత్ర ప్రేక్షకులను ఆకట్టుకుంది.

బీమ్స్.. అదుర్స్..



మహబూబాబాద్ జిల్లా బయ్యారం గ్రామానికి చెందిన బీమ్స్‌కు చిన్నప్పటి నుంచి పాటలు రాయడం, పాడడం అలవాటు. ఈ ఇష్టంతోనే సినిమా రంగంలో ప్రవేశించారు. 'బాబూ ఓ రాంబాబు'తోపాటు అనేక పాటలు రాసి ప్రేక్షకులను ఉర్రూతలూగించారు. బలగం సినిమాకు సంగీత దర్శకుడిగా పనిచేసి ప్రతి పాటను వీనుల విందుగా తీర్చిదిద్దారు. బ్యాక్‌గ్రౌండ్ పాటలకు సైతం సన్నివేశాలకు తగిన విధంగా సంగీతం అందించారు.

బంధాన్ని గుర్తు చేసిన 'బాబు'



బలగం సినిమాలో మరో కీలక పాత్రలో అద్భుత నటన ప్రదర్శించి జీవం పోసిన గుడిబోయిన బాబుది వరంగల్ జిల్లా రాయపర్తి మండల కేంద్రం. సాంఘిక, సామాజిక చైతన్య నాటకాలు, తొమ్మిది సినిమాల్లో నటించారు. బలగం సినిమాలో కొమురయ్య తమ్ముడు అంజయ్య పాత్రలో నటించాడు. అన్న కొడుకులు పంచాయితీ పెట్టుకుంటే.. కనీసం సమాధి కట్టేందుకు నాలుగు గజాల జాగా కాడ కూడా గొడవ పెట్టుకోవడం చూసి తల్లడిల్లిపోయిన పాత్రతో సినిమా చూసిన వారికి కంట తడి పెట్టించారు.

గ్రామ స్వరాజ్య సాధన దిశగా ప్రభుత్వం

- తెలంగాణకు జాతీయ అవార్డుల వరద
- ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి



కాటారం పంచాయతీ కార్యదర్శి, సర్పంచ్‌కు అవార్డు అందజేస్తున్న ఎమ్మెల్యే గండ్ర, కలెక్టర్

భూపాలపల్లి: గ్రామ స్వరాజ్యం సాధన దిశగా రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటుందని, ఇందుకు తెలంగాణకు జాతీయ అవార్డుల వరద వస్తుందని ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి అన్నారు. శనివారం జిల్లాకేంద్రంలోని ఇల్లందు క్లబ్ హౌస్‌లో దీన్ దయాళ్ ఉపాధ్యాయ సతత్ పంచాయతీ వికాస్ పురస్కారం కింద 9 అంశాల్లో ఎంపికైన పంచాయతీలకు జిల్లాస్థాయి జాతీయ పంచాయతీ అవార్డుల ప్రదానోత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో జెడ్పీ చైర్‌పర్సన్ జక్కు శ్రీహర్షిణి, కలెక్టర్ భవేష్ మిశ్రాలతో కలిసి ఎమ్మెల్యే గండ్ర అవార్డులను ప్రదానం చేసిన అనంతరం మాట్లాడారు. గ్రామీణ ప్రాంతాల అభివృద్ధి ధ్యేయంగా సీఎం కేసీఆర్ ప్రారంభించిన పల్లె ప్రగతి కార్యక్రమాన్ని అధికారులు, ప్రజా ప్రతినిధులు సమష్టిగా కృషిచేసి విజయవంతం చేశారన్నారు. దీనివలన రాష్ట్రంలోని పల్లెల స్వరూపం పూర్తిగా మారిపోయిందన్నారు. పల్లెప్రగతి కార్యక్రమం కింద గ్రామీణ ప్రాంతాల్లో పారిశుద్ధ్యం మెరుగుపరిచేందుకు తీసుకున్న చర్యలు సత్ఫలితాలు అందించాయన్నారు. ప్రతీ గ్రామంలో డంపింగ్ యార్డు నిర్మాణం, ట్రాక్టర్ ద్వారా చెత్త సేకరణ, కంపోస్ట్ షెడ్డు, నర్సరీ, వైకుంఠధామం నిర్మాణం వంటి వసతులు ఉన్న ఏకైక రాష్ట్రం తెలంగాణ మాత్రమేనని అన్నారు. కేంద్ర ప్రభుత్వం జాతీయస్థాయిలో 20 ఉత్తమ గ్రామ పంచాయతీలను ప్రకటిస్తే అందులో 19 గ్రామ పంచాయతీలు తెలంగాణ రాష్ట్రానికి చెందినవి కావడం గర్వకారణమన్నారు. జెడ్పీ చైర్‌పర్సన్ శ్రీహర్షిణి మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన 9 అంశాల్లో జిల్లా స్థాయిలో జాతీయ అవార్డులు సాధించిన గ్రామాలను స్ఫూర్తిగా తీసుకొని అన్ని గ్రామాల అభివృద్ధి దిశగా ప్రజాప్రతినిధులు అధికారులు పనిచేయాలని సూచించారు. కలెక్టర్ భవేష్ మిశ్రా మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం సూచించిన 9 అంశాల్లో టాప్ 3గా నిలిచే 3 గ్రామాలను ఎంపిక చేసి అవార్డులు అందిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ టీఎస్ దివాకర, డీపీఓ ఆశాలత, జిల్లా అధికారులు, జెడ్పీటీసీ సభ్యులు, ఎంపీపీలు, సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

విద్యార్థులు సేవాభావాన్ని అలవర్చుకోవాలి

ఏటూరునాగారం: విద్యార్థులు సేవాభావాన్ని అలవర్చుకోవాలని ఐటీడీఏ పీఓ అంకిత్ అన్నారు. మండల కేంద్రంలోని ఆర్ ఐటీఐ కళాశాలలో ఏటూరు నాగారం బీ 39 బెటాలియన్ సీఆర్‌పీఎఫ్ ఆధ్వర్యంలో విద్యార్థులకు క్రీడా సామగ్రి, గొత్తికోయలకు వైద్య శిబిరాన్ని శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా పీఓ అంకిత్ ముఖ్య అతిథిగా హాజరై విద్యార్థులకు క్రీడా సామగ్రిని అందజేశారు.

చేయూత..



ఎన్‌ఎల్‌ఎం పథకంతో ప్రోత్సాహం

- గొర్రెలు, కోళ్ల యూనిట్ల ఏర్పాటుకు రుణాలు
- అన్ని సామాజిక వర్గాలకూ వర్తింపు
- యూనిట్ విలువ రూ.20లక్షల నుంచి రూ.కోటి
- ఆన్‌లైన్‌లో దరఖాస్తుల స్వీకరణ

భూపాలపల్లి రూరల్: దేశంలో మాంసం ఉత్పత్తులను పెంచుతూ జీవాల పెంపకందారులకు చేయూతనివ్వాలనే లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం చర్యలు చేపట్టింది. నేషనల్ లైవ్‌స్టాక్ మిషన్(ఎన్ఎల్ఎం) పథకం ద్వారా గొర్రెలు, మేకలు, కోళ్ల పెంపకానికి ప్రోత్సాహం ఇవ్వాలని భావిస్తోంది. దీనిలో భాగంగా ఒక్క యూనిట్ స్థాపనకు 50 శాతం సబ్సిడీతో రూ.20 లక్షల నుంచి రూ.కోటి వరకు రుణాలు అందించాలని నిర్ణయించింది. గొల్ల కుర్మలకే కాకుండా అన్ని సామాజిక వర్గాలకు చెందిన వారిని అర్హులుగా ప్రకటించింది. పశుసంవర్ధక శాఖ ద్వారా ఈ పథకం అమలుకు శ్రీకారం చుట్టింది.

నేషనల్ లైవ్‌స్టాక్ మిషన్ ద్వారా ఇంతకు ముందు రూ. కోటి విలువైన యూనిట్లు మాత్రమే మంజూరు చేసేవారు. అందులో రూ.50 లక్షలు సబ్సిడీ రూ.40లక్షల బ్యాంకు రుణం, రూ.10 లక్షలు లబ్ధిదారుడి వాటాగా ఉండేది. ఈ యూనిట్ కింద 500గొర్రెలు, 25పొట్టేళ్లు ఇచ్చేవారు. యూనిట్ విలువ ఎక్కువగా ఉండటం వలన బ్యాంకులు షూరిటీ లేకుండా రుణాలను ఇవ్వడంలేదు. దీంతో కేంద్ర ప్రభుత్వం గొర్రెల యూనిట్లను ఐదు విభాగాలుగా విభజించి రుణాలను అందజేయాలని ఇటీవల నిబంధనలు సడలించింది. దీని ప్రకారం 105 గొర్రెల నుంచి 525 గొర్రెల వరకు రూ.20 లక్షల నుంచి రూ. 1కోటి వరకు రుణాలు ఇస్తున్నారు. జిల్లాలో ఇప్పటివరకు ఇద్దరు దరఖాస్తులు చేసుకున్నారు. ఇందులో ఒకరికి రూ.కోటి యూనిట్ మంజూరైంది. ఒకరి దరఖాస్తు పరిశీలనలో ఉన్నట్లు అధికారులు తెలుపుతున్నారు.

ఆన్‌లైన్‌లోనే దరఖాస్తు..

ఎంపిక చేసుకున్న యూనిట్‌ను బట్టి రెండు ఎకరాల నుంచి పది ఎకరాల భూమి అవసరం ఉంటుంది. భూమిలేకున్నా లీజుకు తీసుకోవచ్చు. చుట్టూ ఫెన్సింగ్‌చేసి నిర్మించి అందులో మేతపెంపకం చేసుకోవడానికి బ్యాంకు లోన్ కోసం కాన్సెంట్ తీసుకురావాలని ఒరిజినల్ డ్యాకుమెంట్లు జతచేస్తూ.. ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి. వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకొని కాపీలను జిల్లా కేంద్రంలోని జిల్లా పశు సంవర్ధక శాఖ కార్యాలయంలో అందజేయాల్సి ఉంటుంది. చివరి గడువు లేకుండా.. ఎప్పుడైనా దరఖాస్తు చేసుకునే వెసులుబాటును కేంద్రం కల్పించింది.


యూనిట్ల విభజన ఇలా..

గొర్రెలు+ పొట్టేలు	విలువ (రూ.లక్షల్లో)
100+5	20లక్షలు
200+10	40లక్షలు
300+15	60 లక్షలు
400+20	80 లక్షలు
500+25	రూ.కోటి వరకు

ఎంపిక విధానం..

ఎన్ఎల్ఎం పథకానికి లబ్ధిదారుల ఎంపిక కోసం రాష్ట్ర, కేంద్ర స్థాయిలో రెండు కమిటీలు ఉంటాయి. ఆన్‌లైన్‌లో వచ్చిన దరఖాస్తులను క్షుణ్ణంగా పరిశీలించి లబ్ధిదారులను ఎంపిక చేస్తారు. బ్యాంకు రుణం మంజూరైన తర్వాత 25శాతం, యూనిట్ గ్రౌండింగ్ అయిన తర్వాత 25శాతం సబ్సిడీని బ్యాంకులో జమచేస్తారు. బ్యాంకు రుణం అవసరం లేనివారు సొంతంగా పెట్టుబడి పెట్టి ఏర్పాటు చేసుకున్న తర్వాత సబ్సిడీ పొందవచ్చు.

సద్వినియోగం చేసుకోవాలి..



కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న నేషనల్ లైవ్ స్టాక్ మిషన్ సబ్సిడీ పథకాన్ని జిల్లాలోని రైతులు సద్వినియోగం చేసుకోవాలి. 50శాతం సబ్సిడీ ఇస్తున్నందున పెంపకందారులకు ఉపయోగకరంగా ఉంటుంది. ఇప్పటివరకు జిల్లాలో ఇద్దరు దరఖాస్తులు చేసుకున్నారు. ఒకరికి యూనిట్ మంజూరైంది. ఇంకోటి ప్రాసెస్‌లో ఉంది. ఆసక్తి గల వారు వివరాలకు జిల్లా పశు సంవర్ధక శాఖ కార్యాలయంలో సంప్రదించాలి. ఎప్పుడైనా దరఖాస్తు చేసుకునే అవకాశం ఉంది.

– వి.రంగారావు, జిల్లా పశు, సంవర్ధక శాఖ అధికారి

రూ.200కోట్లతో పీఎస్‌ల నిర్మాణం

- హోం శాఖ మంత్రి ఎండీ మహమూద్ అలీ



మొగుళ్లపల్లి పోలీస్‌స్టేషన్ ప్రారంభం అనంతరం అధికారులు, ప్రజాప్రతినిధులతో హోం మంత్రి మహమూద్ అలీ

- వివరాలు 8లో▸

146 మంది గైర్హాజరు

భూపాలపల్లి అర్బన్: జిల్లాలో జరుగుతున్న ఇంటర్మీడియట్ వార్షిక పరీక్షల్లో భాగంగా శనివారం విద్యార్థులు గైర్హాజరైనట్లు జిల్లా ఇంటర్ విద్య నోడల్ అధికారి దేవరాజం శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రథమ సంవత్సరం భౌతిక, అర్థశాస్త్రం, వొకేషనల్ పరీక్షలకు 1,935మంది హాజరుకావాల్సి ఉండగా 1,789 మంది హాజరైనట్లు తెలిపారు.



శ్రీభద్రకాళి అమ్మవారికి కరవీర పుష్పార్చన

హన్మకొండ కల్చరల్ : శ్రీభద్రకాళి దేవాలయంలో వసంత నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా శనివారం అమ్మవారికి కరవీర (గులాబీ రంగు గన్నేరు పూలు) పుష్పార్చన నిర్వహించారు. ప్రధానార్చకులు భద్రకాళీశేషు ఆధ్వర్యంలో అమ్మవారికి నిత్యాహ్నికం జపహోమ అర్చనాదులు నిర్వహించారు. గన్నేరు పూలకు సంప్రోక్షణ జరిపి లక్షపుష్పార్చన నిర్వహించారు.

క్లుప్తంగా

వినియోగదారుల మండలి
ఉమ్మడి జిల్లా అధ్యక్షురాలిగా మంజుల



నియామక పత్రం అందుకుంటున్న మంజుల

హన్మకొండ చౌరస్తా: తెలంగాణ రాష్ట్ర వినియోదారుల మండలి మహిళా విభాగం ఉమ్మడి వరంగల్ జిల్లా అధ్యక్షురాలిగా హనుమకొండలోని గోపాలపురానికి చెందిన సాగంటి మంజుల నియమితులయ్యారు. ఈ మేరకు శనివారం హైదరాబాద్‌లోని వినియోగదారుల మండలి రాష్ట్ర కార్యాలయంలో మంజులకు రాష్ట్ర అధ్యక్షురాలు శ్రావ్య నియామక పత్రం అందించారు. వినియోగదారుల్లో చైతన్యం పెంపొందించి, హక్కుల పరిరక్షణకు తనవంతుగా కృషి చేస్తానని, ఈ నియామకానికి సహకరించిన రాష్ట్ర అధ్యక్షుడు సీతారాజ్‌కుమార్‌కు మంజుల కృతజ్ఞతలు తెలిపారు.

పంట రక్షణ ప్రాణం తీసింది
- కరెంట్ ఫెన్సింగ్‌కు రైతు బలి



నాగరాజు (ఫైల్)

పాలకుర్తి టౌన్: ఆరుగాలం శ్రమించి పంటలు సాగు చేసే క్రమంలో అడవి జంతువుల బారిన పడకుండా నివారణ చర్యలు చేపట్టే అన్నదాతల ప్రాణాలు గాలిలో కలుస్తున్న దుర్ఘటన మరోసారి పాలకుర్తి మండలం చెన్నూరులో చోటు చేసుకుంది. ఎస్సై యాకుబ్ హుస్సేన్ తెలిపిన వివరాల ప్రకారం.. జనగామ జిల్లా పాలకుర్తి మండలంలోని చెన్నూరుకు చెందిన బాలబోయిన నాగరాజు (35) అనే వ్యక్తి వ్యవసాయంతో పాటు ప్రైవేట్ ఆర్టీసీ డ్రైవర్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. తన పంటను నాశనం చేస్తున్న పందులు, కోతుల నివారణకు పంట చేను చుట్టూ కరెంట్ లైన్ బిగించాడు. శనివారం పొలంలో యూరియా చల్లే క్రమంలో ప్రమాదశాత్తు కరెంట్ వైరుకు తాకడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి భార్య కోమలత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు. కాగా ఈనెల 9న వావిలాల గ్రామానికి చెందిన సోమయ్య కూడా పంట రక్షణకు ఏర్పాటు చేసిన విద్యుత్ లైన్ తగిలి అక్కడికక్కడే మృతి చెందాడు. ఒకే నెలలో ఇద్దరు రైతులు బలి కావడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న హోం మంత్రి మహమూద్ అలీ



టేకుమట్ల: పోలీస్‌స్టేషన్ భవనాన్ని ప్రారంభిస్తున్న హోం మంత్రి



రూ.200 కోట్లతో పీఎస్‌ల నిర్మాణం

- సీసీ కెమెరాలతో పకడ్బందీ నిఘా
- షీ టీమ్స్‌తో మహిళలకు భద్రత
- పోలీస్ నియామకాల్లో మహిళలకు 33శాతం రిజర్వేషన్
- హోం శాఖ మంత్రి ఎండీ మహమూద్ అలీ

మొగుళ్లపల్లి/టేకుమట్ల: ఉమ్మడి వరంగల్ జిల్లాలో రూ.200 కోట్లతో నూతన పోలీస్‌స్టేషన్(పీఎస్) భవన నిర్మాణాలు చేపట్టడం జరిగిందని హోం శాఖ మంత్రి ఎండీ మహమూద్ అలీ అన్నారు. శనివారం జయశంకర్ భూపాలపల్లి జిల్లా మొగుళ్లపల్లికి వచ్చిన హోం మంత్రికి జిల్లా కలెక్టర్, ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు ఘనంగా స్వాగతం పలికారు. పోలీసుల గౌరవ వందనం స్వీకరించిన హోం మంత్రి స్థానిక ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి, ఎంపీ దయాకర్, డీజీపీ అంజనికుమార్, కలెక్టర్ భవేశ్ మిశ్రాతో కలిసి మండల కేంద్రంలో రూ.2.50 కోట్లతో నిర్మించిన పోలీస్ స్టేషన్ నూతన భవనాన్ని ప్రారంభించారు. అలాగే జయశంకర్ భూపాలపల్లి జిల్లాలోని కాళేశ్వరం, పలిమెల మండలాల పోలీస్‌స్టేషన్లను వర్చువల్ విధానంలో ప్రారంభించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో హోం మంత్రి మాట్లాడుతూ రాష్ట్రం ఏర్పడిన కొత్తలో శాంతి భద్రతలు, నక్సలిజం పెరుగుతుందనే అపోహలను సీఎం కేసీఆర్ నాయకత్వంలో పోలీస్‌శాఖ పటాపంచలు చేసిందని, దేశంలోనే అత్యుత్తమంగా శాంతి భద్రతలను కాపాడుతూ ఆదర్శంగా నిలిచారన్నారు. రూ.700కోట్లతో ఆధునిక పెట్రోలింగ్ వాహనాలు, డయల్ 100 వ్యవస్థను పటిష్టం చేశారని పేర్కొన్నారు. ఫ్రెండ్లీ పోలీసింగ్ విధానాన్ని ప్రవేశపెట్టి ప్రజల్లో విశ్వాసాన్ని పెంపొందించామని, మహిళలకు 33 శాతం రిజర్వేషన్ కల్పించి ప్రతీ పోలీస్‌స్టేషన్‌లో మహిళా సిబ్బంది అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకున్నామని పేర్కొన్నారు. 8 సంవత్సరాల్లో రాష్ట్రంలో క్రైం రేట్ తగ్గిపోయిందని, దేశంలో సురక్షిత మహానగరంగా హైదరాబాద్ నిలిచిందన్నారు. పోలీస్‌స్టేషన్ల నిర్వాహణకు రూ.75వేలు, రూరల్ ప్రాంతంలో రూ.50వేలు, గ్రామీణ ప్రాంతాల్లో రూ.25వేలు అందిస్తున్నామన్నారు. ఒక సీసీ కెమెరా 100 మంది పోలీసులతో సమానమని, దేశంలో వినియోగిస్తున్న సీసీ కెమెరాల్లో 64 శాతం తెలంగాణ రాష్ట్రానివే అన్నారు. దేశంలో ఎక్కడా లేని విధంగా హైదరాబాద్‌లో కమాండ్ కంట్రోల్ సెంటర్‌ను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. రూ.2.5 కోట్లతో నిర్మించిన టేకుమట్ల పోలీస్‌స్టేషన్ కార్పొరేట్ స్థాయిలో ఉందన్నారు. ఈ కార్యక్రమంలో డీజీపీ అంజనీకుమార్, ఐజీ చంద్రశేఖర్ రెడ్డి, పోలీస్ హౌసింగ్ సొసైటీ చైర్మన్ కోలేటి దామోదర్, భూపాలపల్లి, వరంగల్ జిల్లాల జెడ్పీ చైర్‌పర్సన్‌లు జక్కుల శ్రీహర్షిణి, గండ్ర జ్యోతి, కలెక్టర్ భవేష్ మిశ్రా, ఎస్పీ సురేందర్ రెడ్డి, పోలీసు ఉన్నతాధికారులు, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ దివాకర, జిల్లా సంక్షేమ అధికారి శైలజ, సీడీపీఓ అవంతి, జెడ్పీటీసీ పులి తిరుపతి రెడ్డి, సర్పంచ్, ఎంపీటీసీలు పొలాల సరోత్తంరెడ్డి, ఆది సునీత రఘు, తదితరులు పాల్గొన్నారు.

సాంకేతిక పరిజ్ఞానాన్ని అందించాలి

- పీజేటీఎస్‌ఏయూ విస్తరణ సంచాలకులు డాక్టర్ సుధారాణి
- బాలవికాసలో ముగిసిన రైతు సదస్సు



సదస్సులో మాట్లాడుతున్న డాక్టర్ సుధారాణి

కాజీపేట రూరల్: వ్యవసాయ సాగు పద్ధతిలో వ్యవసాయ శాస్త్రవేత్తలు రైతులు వేసే పంటల్లో నూతన సాంకేతిక పరిజ్ఞానాన్ని సకాలంలో అందించాలని ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయం (పీజేటీఎస్‌ఏయూ) విస్తరణ సంచాలకులు డాక్టర్ వి. సుధారాణి అన్నారు. కాజీపేట ఫాతిమానగర్ బాలవికాస సెంటర్‌లో శనివారం ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయం, వ్యవసాయ శాఖ ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం వరంగల్ ఆధ్వర్యంలో మధ్య తెలంగాణ మండల వ్యవసాయ పరిశోధన, విస్తరణ సలహా సంఘం ముగింపు సమావేశం జరిగింది. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా సుధారాణి హాజరై మాట్లాడుతూ శాస్త్రవేత్తలు, వ్యవసాయ అధికారులు రైతులతో నిత్యం మమేకమై కొత్త సాంకేతిక పరిజ్ఞానాన్ని వివిధ మాధ్యమాల ద్వారా రైతులకు తెలియజేస్తే అధిక ఆదాయం, దిగుబడి వచ్చే అవకాశం ఉందన్నారు. వ్యవసాయ విశ్వవిద్యాలయం విత్తన సంచాలకులు డాక్టర్ జగన్మోహన్‌రావు మాట్లాడుతూ వివిధ పంటల్లో నాణ్యమైన విత్తనోత్పత్తిపై అవగాహన కల్పించడంతో పాటు క్షేత్ర ప్రదర్శనలు నిర్వహించి రైతుల సందేహాలను నివృత్తి చేయాలన్నారు. అనంతరం వరంగల్ ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం సహ పరిశోధన సంచాలకులు డాక్టర్ ఆర్.ఉమా రెడ్డి, వ్యవసాయ కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ బలరాం, ఆర్‌ఈఏసీ మెంబర్ టి.రాణప్రతాప్, నాబార్డు ఏజీఎం చంద్రశేఖర్, కమిషనరేట్ జేడీఏ సుజాతలు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయం ప్రధాన శాస్త్రవేత్తలు, వివిధ జిల్లాల అధికారులు, మధ్య తెలంగాణ మండలి శాస్త్రవేత్తలు, అధికారులు, అభ్యుదయ రైతులు తదితరులు పాల్గొన్నారు.

28న వరంగల్ డీసీసీబీ మహాజన సభ

హన్మకొండ: వరంగల్ జిల్లా సహకార కేంద్ర బ్యాంక్ (డీసీసీబీ) మహాజన సభ ఈనెల 28న నిర్వహిస్తున్నట్లు ఆ బ్యాంక్ ముఖ్య కార్య నిర్వహణాధికారి సీహెచ్.చిన్నారావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. సోమవారం ఉదయం 11:00 గంటలకు హనుమకొండలోని అంబేద్కర్ భవన్‌లో జరిగే ఈ మహాజన సభకు సభ్యులంతా హాజరు కావాలని ఆయన కోరారు.

అంచనాల బడ్జెట్, వార్షిక నివేదిక ఆమోదం

- మరోసారి పరిశీలించాక కోడిఫైడ్ సర్వీస్ రూల్స్
- కేయూ పాలకమండలి సమావేశంలో నిర్ణయం



కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీ పాలకమండలి సమావేశం శనివారం హైదరాబాద్‌లో నిర్వహించారు. ఈ ఆర్థిక సంవత్సరం అంచనాల బడ్జెట్, వార్షిక నివేదికను, అకాడమిక్ స్టాండింగ్ కమిటీ నిర్ణయాలను చర్చించి ఆమోదించినట్లు సమాచారం. పలు అంశాలపై వాడివేడిగానే చర్చ జరిగినట్లు తెలిసింది. ప్రధానంగా కాకతీయ యూనివర్సిటీలోని నాన్ టీచింగ్ కోడిఫైడ్ సర్వీస్ రూల్స్‌పై చర్చ జరగగా విద్యాశాఖ ప్రిన్సిపాల్ సెక్రటరీ వాకాటి కరుణ మిగతా యూనివర్సిటీలో ఎలా ఉన్నాయనేది పరిశీలించాలని, ఆ తరువాత ఆమోదింపచేద్దామని సూచించారని సమాచారం. యూనివర్సిటీ పరిధిలోని ఖమ్మం పీజీ సెంటర్‌లో గతంలో ప్రిన్సిపాల్‌గా పనిచేసిన అయిలయ్యపై పలు ఆరోపణలు రాగా, ఆయన ఉద్యోగ విరమణకు కొంతకాలమే ఉండడంతో చిన్న పనిష్మెంటు ఇవ్వాలని నిర్ణయించారని సమాచారం. హనుమకొండలోని యూనివర్సిటీ ఆర్ట్స్‌అండ్ సైన్స్‌కళాశాలలో ఓ మహిళా అసిస్టెంట్ ఆచార్యులు తరచూ ఆబ్సెంట్ అయినట్లు ఆరోపణలు రావడంతో వాటికి వేతనం కట్‌చేయాలని నిర్ణయించారని సమాచారం. కేయూ భూమి వ్యవహారంపై నివేదిక అంశంపై ఎజెండాలో చేర్చలేదు. సమావేశంలో వీసీ రమేశ్, కళాశాల విద్య ఆర్‌జేడీ యాదగిరి, రిజిస్ట్రార్ శ్రీనివాస్ రావు, పాలకమండలి సభ్యులు పాల్గొన్నారు.

‘బేబక్క’ మృతి విప్లవోద్యమానికి తీరని లోటు



అంతిమ యాత్రలో పాల్గొన్న న్యూడెమోక్రసి నాయకులు

కొత్తగూడ/నర్సంపేట/ఎంజీఎం: కమ్యూనిస్టు విప్లవ సంఘాల నాయకురాలు బేబక్క (నిమ్మగడ్డ సరోజన) (83) అకాల మృతి భారత విప్లవ ఉద్యమాలకు తీరని లోటని పలువురు నాయకులు అన్నారు. మహబూబాబాద్ జిల్లా కొత్తగూడ మండలం గుండంపల్లిలో శుక్రవారం అనారోగ్యంతో బేబక్క మృతి చెందగా శనివారం అంతిమ యాత్ర నిర్వహించారు. ఆమెను చివరి చూపు చూసేందుకు పలు గ్రామాల నుంచి ప్రజలు, వివిధ పార్టీల నాయకులు, న్యూడెమోక్రసి నాయకులు భారీగా తరలి వచ్చారు. ఇల్లందు మాజీ ఎమ్మెల్యే గుమ్మడి నర్సయ్య బేబక్క మృతదేహానికి నివాళులర్పించారు. శ్రీశైలం, బూర్క వెంకటయ్య, యాదగిరి యుగేందర్, చంద్రన్న, ప్రభాకరన్న, బండారి అయిలన్న, నాయకులు నాగమల్లేశ్వర్‌రావు, వజ్జ సారయ్య, యాకయ్య తదితరులు పాల్గొన్నారు.

నర్సంపేటలో..

వరంగల్ జిల్లా నర్సంపేట పట్టణంలోని అంబేడ్కర్ సెంటర్‌లో బేబక్క భౌతికాయానికి శనివారం పలువురు నాయకులు సందర్శించి నివాళులర్పించారు. సీపీఐ (ఎంఎల్) ప్రజాపంథా రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు చంద్రన్న, రాష్ట్ర నాయకులు రాయల చంద్రశేఖర్, ఐఎఫ్‌టీయూ రాష్ట్ర నాయకుడు కొత్తపల్లి రవి, ముంజంపల్లి వీరన్న, డివిజన్ నాయకులు కోడం సారంగం, అడ్డూరి రాజు, కత్తుల కొమరన్న, ఎంసీపీఐ(యూ) జాతీయ ప్రధాన కార్యదర్శి మద్దికాయల అశోక్ తదితరులు బేబక్క మృతదేహంపై పూలమాల వేసి నివాళులర్పించారు.

కేఎంసీకి మృతదేహం అప్పగింత

అనారోగ్యంతో మృతి చెందిన బేబక్క మృతదేహాన్ని ఆమె కుటుంబ సభ్యులు, శరీర అవయవ దాతల అసోసియేషన్ సభ్యులు శనివారం కేఎంసీకి అప్పగించారు. గుండంపల్లి, పాగుళ్లపల్లి గ్రామాల ప్రజలు కేఎంసీకి భారీగా తరలివచ్చి నివాళులర్పించారు.

కళా ఉత్సవ్ జాతీయ విజేతకు సన్మానం



లక్ష్మిప్రియను సన్మానిస్తున్న కలెక్టర్, జెడ్పీ చైర్మన్

హన్మకొండ: కళా ఉత్సవ్ జాతీయ విజేత లక్ష్మి ప్రియను హనుమకొండ జిల్లా జెడ్పీ చైర్మన్ డాక్టర్ మారపల్లి సుధీర్ కుమార్, కలెక్టర్ సిక్తా పట్నాయక్‌లు ఘనంగా సన్మానించారు. శనివారం హనుమకొండలోని జెడ్పీ కార్యాలయ సమావేశంహాల్‌లో జరిగిన కార్యక్రమంలో ఆమెకు శాలువా కప్పి, మొక్క, ప్రశంస పత్రం అందించి ఘనంగా సన్మానించారు. కాజీపేట మౌంట్ ఫోర్ట్ పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న లక్ష్మి ప్రియ కళా ఉత్సవ్‌పోటీల్లో జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయిలో కూచిపూడి నృత్యంలో పాల్గొని అత్యుత్తమ ప్రదర్శన ఇచ్చి ప్రథమ స్థానంలో నిలిచింది. దీంతో కేంద్ర ప్రభుత్వం రిపబ్లిక్ వేడుకలకు ఆహ్వానించడంతో పాటు పీఎం నరేంద్ర మోదీ ఎదుట నృత్యం చేసే అవకాశం లభించింది.

అధికారులు అప్రమత్తంగా ఉండాలి
- టీఎస్ ఎన్పీడీసీఎల్ సీఎండీ గోపాల్ రావు

హన్మకొండ: అకాల వర్షాలతో అధికారులు, ఉద్యోగులు అప్రమత్తంగా ఉండాలని టీఎస్ ఎన్పీడీసీఎల్ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ అన్నమనేని గోపాల్ రావు సూచించారు. శనివారం హనుమకొండ నక్కలగుట్టలోని టీఎస్ ఎన్పీడీసీఎల్ ప్రధాన కార్యాలయం నుంచి జనగామ, హనుమకొండ, జయశంకర్ భూపాలపల్లి జిల్లాల ఎస్ఈలు, డీఈలు, ఎస్ఏఓల సమీక్ష సమావేశం జరిగింది. జిల్లాలు, డివిజన్‌లు, విభాగాల వారీగా ప్రగతిని సమీక్షించారు. ఈ సందర్భంగా సీఎండీ గోపాల్ రావు మాట్లాడుతూ వినియోగదారులతో సత్సంబంధాలు ఏర్పరచుకుంటూ సమస్యలు పరిష్కరించాలన్నారు. దత్తత తీసుకున్న గ్రామాల్లో విద్యుత్ సమస్యలు లేకుండా చూడాలన్నారు. ఉద్యోగులు విధిగా పని చేసే స్థలంలోనే నివాసముంటూ కాలిపోయిన, పని చేయని మీటర్లను మార్చాలన్నారు. విద్యుత్ బిల్లులు వంద శాతం వసూళ్లు చేయాలన్నారు. రాని బకాయిల సర్వీసులను తాత్కాలికంగా నిలిపివేయాలని సూచించారు. విద్యుత్ చౌర్యానికి పాల్పడుతున్న వారిపై కేసులు బుక్ చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్‌లు బి. వెంకటేశ్వర్ రావు, పి.గణపతి, పి.సంధ్యారాణి, పి.మోహన్ రెడ్డి, వి.తిరుపతి రెడ్డి, సీజీఎంలు అశోక్ కుమార్, సదర్ లాల్, మోహన్ రావు, కిషన్, భీకంసింగ్ తదితరులు పాల్గొన్నారు.

బ్లాక్ మెయిలింగ్, సెటిల్‌మెంట్‌లలో బిజీగా రేవంత్ రెడ్డి

- మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు



హన్మకొండ: ప్రజాస్వామ్య పరిరక్షణ కు పార్టీలకు అతీతంగా తామంతా కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వ నిరంకుశత్వానికి వ్యతిరేకంగా రాహుల్‌గాంధీ కోసం కొట్లాడుతుంటే, పీసీసీ చీఫ్ రేవంత్‌రెడ్డి మాత్రం బ్లాక్ మెయిలింగ్, సెటిల్‌మెంట్లలో బిజీబిజీగా గడుపుతున్నారని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధిశాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు దుయ్యబట్టారు. శనివారం హనుమకొండలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ రేవంత్‌రెడ్డి.. ఓటుకు నోట్ కేసుకు భయపడి బీజేపీని విమర్శించడానికి భయపడుతున్నాడని ఎద్దేవా చేశారు. బీఆర్‌ఎస్‌పై బురద చల్లే కుయుక్తులకు పాల్పడుతున్నాడని మంత్రి ధ్వజమెత్తారు. రాహుల్‌గాంధీపై అనర్హత వేటు బీజేపీ నియంతృత్వానికి, అణచివేతకు నిదర్శనమని, ప్రశ్నించే గొంతులపై బీజేపీ ఉక్కుపాదం మోపుతుందనడానికి నిలువటద్దమన్నారు. లేనిపోని అపోహలతో, ప్రజలను భయభ్రాంతులకు గురి చేస్తూ, నోటికి వచ్చినట్లు మాట్లాడుతున్న బండి సంజయ్‌ని కూడా పార్లమెంట్ నుంచి బహిష్కరిస్తారా అని మంత్రి సూటిగా ప్రశ్నించారు.

న్యాయమైన డిమాండ్లు పరిష్కరించాలి



మంత్రికి సమస్యలు తెలియజేస్తున్న ఉద్యోగులు

హన్మకొండ: తమ న్యాయమైన డిమాండ్లు, సమస్యలు పరిష్కరించాలని నైబర్‌హుడ్ సెంటర్ ప్రొఫెషనల్స్, ఉద్యోగులు కోరారు. శనివారం హనుమకొండలోని ఆర్ అండ్ బీ అతిథి గృహంలో మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావును కలిసి పుష్పగుచ్ఛం, వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా సొసైటీ ఫర్ ఎలిమినేషన్ ఆఫ్ రూరల్ పావర్టీ నైబర్‌హుడ్ సెంటర్ ప్రొఫెషనల్స్ అసోషియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు ఎ.సురేష్, ప్రధాన కార్యదర్శి ఎం.కిరణ్ కుమార్ మాట్లాడుతూ సెర్ప్, డీఆర్‌డీఏ, ఐకేపీ ఆధ్వర్యంలో నడుస్తున్న నైబర్ హుడ్ సెంటర్‌లో పనిచేస్తున్న ఉద్యోగులకు కేడర్ ఫిక్సేషన్ కల్పించి, హెచ్‌ఆర్ వర్తింపజేయాలని కోరారు. నగరాలు, పట్టణాలకు దూరంగా ఏజెన్సీ ప్రాంత గిరిజనులు, సామాన్యులకు, దివ్యాంగులకు ఫిజియోథెరఫి, స్పీచ్ థెరఫి, స్పెషల్ ఎడ్యుకేషన్ వంటి సేవలు అందిస్తున్నామని, దివ్యాంగుల సాధికారత సాధిస్తూ వారి జీవితాల్లో వెలుగులు నింపుతూ సమాజంలో మమేకం చేస్తున్న తమ పట్ల ప్రభుత్వానికి చిన్న చూపు తగదని మంత్రికి వివరించారు. ఈ కార్యక్రమంలో అసోషియేషన్ కోశాధికారి వి.స్వాతి, మంజుల, వి.శైలజ, బి.యాకయ్య, బి.శిరీష తదితరులు పాల్గొన్నారు.

మృతదేహాలనే మార్చేశారు..

- ఒకరి మృతదేహాన్ని మరొకరికి ఇచ్చిన ఎంజీఎం మార్చురీ సిబ్బంది
- ఇంటికి వెళ్లి చూశాక ఖంగుతిన్న బంధువులు
- మార్చురీ వద్ద కుటుంబ సభ్యుల ఆందోళన
- శాఖాపరమైన చర్యలు తీసుకుంటాం: ఎంజీఎం అధికారులు

ఎంజీఎం: వరంగల్ ఎంజీఎం మార్చురీలో సిబ్బంది నిర్లక్ష్యంతో శనివారం అనూహ్య ఘటన చోటు చేసుకుంది. రెండు మృతదేహాలకు పోస్టుమార్టం నిర్వహించిన అనంతరం ఒకరి మృతదేహానికి బదులు మరొకరి మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించడంతో వారు తమ ఇళ్లకు తీసుకెళ్లి మృతదేహాలను చూసి ఒక్కసారిగా ఖంగుతిన్నారు. తమ బిడ్డ చనిపోయాడని రోదించే క్రమంలో పోస్టుమార్టం సిబ్బంది కట్టిన కట్టు విప్పి చూసే సరికి ఆశ్చర్యానికి గురయ్యారు. వెంటనే స్థానిక పోలీసుల సహకారంతో ఇరువురు కుటుంబ సభ్యులు మృతదేహాన్ని ఎంజీఎంకు తరలించి సిబ్బంది నిర్లక్ష్యంపై ఆందోళన చేపట్టారు. వివరాలిలా ఉన్నాయి.. స్టేషన్‌ఘన్‌పూర్ మండలం తానేదార్‌పల్లికి చెందిన రాగుల రమేశ్ (33) శుక్రవారం కుటుంబ కలహాలతో పురుగుల మందుతాగి ఎంజీఎంలో చికిత్స పొందుతూ శనివారం ఉదయం మృతిచెందాడు. దీంతో వైద్యులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఎంజీఎం మార్చురీకి తరలించారు. భీమదేవరపల్లి మండలం వంగర గ్రామానికి చెందిన ఆశాడపు పరమేశ్ (45) నాలుగు రోజుల క్రితం రోడ్డు ప్రమాదంలో తీవ్ర గాయాలు కాగా చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందాడు. దీంతో పరమేశ్ మృతదేహాన్ని సైతం పోస్టుమార్టం నిమిత్తం మార్చురీకి తరలించారు. శనివారం పోలీసుల పంచనామా అనంతరం రెండు మృతదేహాలకు ఫోరెన్సిక్ వైద్యులు పోస్టుమార్టం నిర్వహించారు. పోస్టుమార్టం నిర్వహించిన అనంతరం పూర్తిస్థాయిలో మృతదేహాలకు కట్టు కట్టి కుటుంబ సభ్యులకు అప్పగించారు. అయితే మృతదేహాలను ఇంటికి తీసుకెళ్లి రోదిస్తున్న క్రమంలో కట్టు విప్పి చూడగా మృతదేహం తమది కాదని భావించిన కుటుంబ సభ్యులు స్థానిక పోలీసుల సహాయంతో మృతదేహాలను ఎంజీఎం మార్చురీకి తీసుకువచ్చారు. ఈ సందర్భంగా మార్చురీ సిబ్బందితో వాగ్వాదానికి దిగారు. పోలీసులు అక్కడికి చేరుకుని ఎవరి మృతదేహాలను వారికి అప్పగించారు. ఈ విషయంపై ఎంజీఎం పరిపాలనాధికారులను వివరణ కోరగా ఘటనపై విచారణ జరిపి చర్యలు తీసుకుంటామని తెలిపారు.

సాక్షి క్లాసిఫైడ్స్

REAL ESTATE

అమ్మబడును

■హన్మకొండ రెడ్డి కాలనీ రోడ్ నెం.3 ఏరియాలో East & West Facing Roads కలిగిన 487 చ॥గ॥ ప్లాట్ అమ్మకానికి కలదు. సంప్ర: 9912506898, 9704208179. [W-1110358]

PLOT FOR SALE

■Kazipet, Fathimanagar, Opp: to Fathima Hospital 161 yards south face plot for sale Near to All Schools, 1KM from Kazipet Railway Station, Cont: 9700040640. [W-785503]

■GWMC-KUDA పరిధిలోని 3300 చ॥గ॥ ఏనుమాముల మార్కెట్ మేన్‌గేట్‌కి ఎదురుగా 2 సైడ్ రోడ్స్ ఫేసింగ్ భూమి అమ్మకానికి కలదు. సంప్ర॥ 9440290009, 9441689294. [W-785504]

■మామునూర్ సెంటర్లో 347 చదరపు గజాల నార్త్ ఈస్ట్ కార్నర్ ప్లాటుకై సంప్రదించవల్సిన సెల్ నెం: 9032111600. [W-775798]

SHUTTER FOR RENT

■హన్మకొండ కాకాజీ కాలనీ రోడ్ నెం.1 Opp: Old గోమతి హాస్పిటల్ ప్రక్కన ఒక Shutter Commercial, Diagnostic Center, Clinic లకు కిరాయికి ఇవ్వబడును. Cell: 9652713960, 8885517884. [WA-6925]

TO-LET

■HNK, భీమారం పలివేల్పుల రోడ్ CRPF క్వార్టర్స్ దగ్గరలో దుర్గానగర్ రోడ్ నెం-6 లోని 6 వేల st G+2 గల బిల్డింగ్ కిరాయికి కలదు కాలేజ్, స్కూల్స్, హాస్టల్స్, బ్యాంక్స్, మినీ ఫంక్షన్ హాల్స్‌కు గోడౌన్‌లకు అనుకూలం. 739653974, 9618337228. [W-785460]

HOUSE FOR SALE

■హన్మకొండ- రాజ్ హోటల్ - హంటర్ రోడ్, నంది హిల్స్ నందు గల 3 BHK లగ్జరీ Deluxe ఫ్లాట్ with Interior, Ready to Occupy అమ్మకమునకు కలదు. సెల్: 7386058582. [WA-6930]

■ఉర్సుగుట్ట నుండి ఖాజీపేట్ వెళ్ళు 150 ఫీట్ల రోడ్డు ప్రక్కన, భట్టుపల్లి SR Prime School కు ఎదురుగా 2 & 3 BHK Independent Houses అమ్మకానికి కలవు. సెల్: 7660008666, 8309035091. [WA-26841]

■GWMC అప్రూవ్డ్ లేఅవుట్ చింతగట్టు హన్మకొండలో విల్లా ప్లాట్లు, 4 BHK డూప్లెక్స్ హౌజ్, 3 BHK ఇండిపెండెంట్ హౌజింగ్ ప్రాజెక్ట్‌లో బుకింగ్స్ ప్రారంభమైనవి. సంప్ర: శ్రీనివాస్ 8978638094, 9949732488 [W-775800]

■ములుగురోడ్డు కాకతీయ కెనాల్ కన్నేమూల గణపతి టెంపుల్‌కి దగ్గరలో G+1 తో గల Independent Houses అమ్మకానికి కలవు. సెల్: 7660008666, 8309035091. [WA-26848]

■వరంగల్, రంగశాయిపేట, శేషాద్రిహిల్స్‌లో E/F తో గల డీలక్స్ Ready to Occupy 2 BHK House అమ్మకానికి కలదు. సెల్: 7660008666, 8309035091. [WA-26847]

■హన్మకొండ నయీంనగర్‌లో H.No: 2-2-189/1 120 చ॥గ॥లలో గల House అమ్మకానికి కలదు. నో బ్రోకర్స్. సెల్: 9030382583. [W-775799]

విల్లా ప్లాట్లు, హౌజెస్ బుకింగ్ ప్రారంభం

■GWMC అప్రూవ్డ్ లేఅవుట్ చింతగట్టు (హన్మకొండ) లో విల్లా ప్లాట్లు 4 BHK డూప్లెక్స్ హౌజెస్ 3 BHK ఇండిపెండెంట్ హౌజింగ్ ప్రాజెక్ట్‌లో బుకింగ్ ప్రారంభమైనవి. సంప్ర: సోమేశ్వర్ - 8317534874 [W-785501]

FLATS FOR SALE

■KUDA కాలనీ 100 ఫీట్ల రోడ్డుకి, SPR School కు దగ్గరలో Stilt Plus 5 ఫ్లోర్స్ అపార్ట్‌మెంటులో 2 & 3 BHK Luxury Flats అమ్మకానికి కలవు. సెల్: 7660008666, 8309035091. [WA-26840]

■HYDERABAD, KUKATPALLY Behind Metro Shopping Mall, Main Road. Maitri Nagar, GHMC Approved. 3BHK Flats. Ready to Occupy. Limited Flats with all amenities. Ph: 9347566287. [HA-1069]

■Flat for sale Very good 2Bed Room Apartment 1200sft TNGO Colony in Warangal. Resonable Price Very good Location to 9949172436 [H-796735]

LAND FOR SALE

■For Sale 163 Acres Single - Bit prime Land, Clear Title, Road-facing. Close to Vijayawada - Nagpur Expressway, Excellent Environment for Living, Business and agriculture, High iron soil. Nawabpet (V), Chityala (M), Bhupalpally(D). Cont: 7675868777, 9390085828. info@amodagroup.com [HA-26365]

■1 Acre Land Elkathurthy KUDA Ideal For Farm House 500 Meters to KNR Highway. Bore Water. Ph: 9100910097. [H-793653]

SERVICES

■సిరి అసోసియేట్స్ హౌజ్, ఫ్లాట్, ఓపెన్ ప్లాట్, ల్యాండ్, వ్యవసాయ భూమి, వ్యక్తిగత, ఏ ప్రాపర్టీ అయినా మార్టిగేజ్ చేసుకొని వారంలో అమౌంట్ ఇప్పించబడును. సెల్: 9666142226. [W-785458]

బ్యూటీ పార్లర్

■ మా శైలి బ్యూటీపార్లర్‌లో బ్యూటీషియన్ కోర్సు Free గా నేర్పించి సెంట్రల్ గవర్నమెంట్ సర్టిఫికెట్ ఇవ్వబడును. మ్యారేజ్ Makeup, మెహిందీ చేయబడును. సంప్ర: 9989060668 [W-785462]

LOANS

■ హౌసింగ్, బిజినెస్, పర్సనల్, మార్టిగేజ్ & ఉద్యోగస్తులందరికి పర్సనల్ రుణాలు ఏ బ్యాంకులలో అయినా ఇప్పించబడును & IT Returns, GST License చేయబడును. పద్మావతి ఫైనాన్స్-WGL 9618767116 [W-785454]

సర్టిఫికేట్స్ పోయినవి

■ EEDA Vamshi, S/o. E. Vidyasagar వి NIT Warangal MBA 4th Quarter Original Certificates (2013-2015) year with Roll No. 138918, NIT Warangal) గల సర్టిఫికేట్స్ హన్మకొండ బస్టాండ్ నుండి మా ఇంటికి వస్తుండగా దారిలో ఎక్కడో పడిపోయినవి. దొరికినవారు ఈ క్రింది నెంబర్‌కి తెలువగలరు. 9100011143. [W-785465]

మ్యారేజ్ బ్యూరో

■జ్యోతి మ్యారేజ్ బ్యూరో : పద్మశాలి, మున్నూరు కాపు, గౌడ, SC, ముద్రాసి మొదటి, రెండవ, సంబంధాలు అన్ని కులముల వారికి చూడబడును. 79897 71024, 97048 99451. [M-9122]

WANTED

■Wanted Good Looking Un Married Female for Receptionist / Admn. Salary give 20 K to 25 K. Direct Job. Cont: 9963490087 [WA-5299]

■Wanted in House Photographer and Videographer for Reputed Hospital. Cont: 9347481888. [WA-12843]

■Wanted Female Telecallers with Good Communication Skills, Salary 7500 + Incentives. Cell: 8977241841. [WA-6929]

■Wanted Receptionist Urgent. Male/ Female. Q: Any Degree. Good Communication in English must. Mandiwala Restaurant, Nakkalagutta, Hanamkonda. Cell: 9848092503. [WA-5284]

■హవిలాహ్ అసోసియేట్స్ నందు పని చేయుటకు టెలికాలర్స్ కావలెను. Good Looking Female మరియు మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్స్ కావలెను. దర్గారోడ్, NIT ప్రక్కన, 70932 85999. [M-9174]

■హన్మకొండ, వరంగల్ లోకల్‌లోని షాపింగ్ మాల్స్ హాస్పిటల్‌లో పని చేయుటకు సెక్యూరిటీ గార్డ్స్ & స్వీపర్స్ అర్జెంటుగా కావలెను. 8 గం॥ 12 గం॥ డ్యూటీలు కలవు. జీతం: 10000-15000 సంప్ర॥ 9703637320 [W-785461]

■ప్రముఖ సంస్థ నందు మీ ఇంటి దగ్గర ఉంటూ పార్ట్/ఫుల్‌టైం పోస్టల్ కవర్లపై అడ్రస్‌లు వ్రాయుటకు స్త్రీ/పురుషులు కావలెను. జీతం॥ 15000+ ఇన్సెంటివ్స్. ఫ్రీ బుక్‌లెట్ కొరకు 9059509586 [G-795262]

■హరేకృష్ణ హోంకేర్, నందు వృద్ధులను, పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్/ నర్సులు కావలెను, ఫ్రీ వసతి + భోజనం. జీతం:16k - 18k విజయవాడ.ఫోన్ : 9640528889, 9640648889 [H-793405]

■ఇంటి దగ్గర ఉండి మా కంపెనీ బల్బులు ఫిట్ చేసి ఇవ్వడం ద్వారా నెలకి 15,000-20,000 వరకు జీతం మరిన్ని వివరాలకై. 9000408325. [G-795265]

తాజా వార్తల కోసం లాగాన్ అవ్వండి www.sakshi.com

■ పనివారు కావలెను. హైదరాబాద్, భువనగిరిలో గల చిన్న కుటుంబానికి ఇంట్లోనే ఉండి వంటపని, ఇంటిపని, తోటపని మొదలగు పనులు చేయుటకు భార్యాభర్తలు కావలెను. డి.బాలాజీ, భువనగిరి. ఫోన్ 9246969042, 9848175211 [V-1788]

■ TATA 709 రికవరీ వెహికిల్ నడుపుటకు హెవీ లైసెన్స్ కల్గిన డ్రైవర్ కావలెను. ఆకర్షణీయమైన జీతం ఇవ్వబడును. కిషోర్ రెడ్డి సంప్ర: 9985400280, 6281523176. [HA-10387]

FACULTY TEACHERS

■ శ్రీ చైతన్య, నారాయణ అకాడమీస్‌లో టీచింగ్ నాన్ టీచింగ్ వర్క్ చేయడానికి ఫిమేల్ స్టాఫ్ అ.కా.ను జీ: 21K to 31K ఇంట్రెస్ట్ ఉన్న వారు డీటెయిల్స్ వాట్సాప్ చేయగలరు. 6281159171 [HA-28696]

4 లైన్ల క్లాసిఫైడ్ ప్రకటన 260/- రూ॥ అదనపు లైను 60/- రూ॥లు మాత్రమే 5% GST అదనము

ఈ సెక్షన్‌లో ప్రకటనల కొరకై సంప్రదించండి
హన్మకొండ 9010144453
వరంగల్ 9705748198
నర్సంపేట 9010144453
జనగామ 9951602871
మహబూబాబాద్ 9010144453
జయశంకర్ భూపాలపల్లి 9705748198

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.